విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

హోం మంత్రి తానేటి వనిత

విశాలాంధ్ర-దేవరపల్లి: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్లో విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దేనని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత స్పష్టం చేశారు. దేవరపల్లి అంబటి సత్యనారాయణ రావు జిల్లా పరిషత్ హై స్కూల్లో అమ్మఒడి నాలుగో విడత చెక్కులు పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్లోనే అమ్మ ఒడి కార్యక్రమం పథకం ప్రవేశపెట్టి విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆనందం చూస్తున్నామని తెలి పారు. విద్యార్థులు తమ కాళ్ళ మీద నిలబడే విధంగా విద్యకు జగన్మోహన్ రెడ్డి పెద్దపేట వేస్తున్నారని ఆమె అన్నారు. నాడు నేడు ప్రభుత్వ స్కూల్లో ప్రవేశపెట్టి కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యకు తక్కువ నిధులు కేటాయింపులు జరిగేవని నాణ్యమైన పుస్తకాలు గాని మౌలిక వసతులు గాని ఉండేవి కావన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత గత నాలుగు సంవత్సరాల నుండి నాడు నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలో మౌలిక సదుపాయాలు పుస్తకాలు అందించడం జరుగుతుందని అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కే మాధవి లత మాట్లాడుతూ జగనన్న అమ్మ ఒడి కార్యక్రమం ద్వారా నాలుగో విడతలో విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా 66 వేల 72 కోట్లు జమ చేయడం జరిగిందని తెలిపారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లా డుతూ ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిలబెట్టుకుంటు న్నారని తెలిపారు. అంతకుముందు హోం మంత్రి తానేటి వనిత ఎంపీ భరత్ రామ్ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కలెక్టర్ మాధవి లత జ్యోతి ప్రజ్వల చేశారు. అనంతరం నమూనా చెక్కును విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తేజు భరత్, జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం, గోపాలపురం ఏఎంసి చైర్మన్ జి. జనార్ధనరావు, దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ పొట్టి స్వర్ణలత, సర్పంచి కడిమి వీర కుమారి, ఎంఈఓలు, అధికారులు పాల్గొన్నారు.

సీలింగ్ భూముల్లో హెచ్చరిక బోర్డులు తొలగించాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : పేదల సాగులో ఉన్న సీలింగ్ భూములలో పెట్టిన హెచ్చరిక బోర్డులను తొలగించి, వారికి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ శ్రీదేవికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ జగ్గంపేట మండలం గుర్రంపాలెం గ్రామ పంచాయతి పరిధిలో గల సర్వే నెంబరు 270/2ఎలో గల ఎకారల 10-9 సెంట్ల భూమిని గత రెండు దశాబ్దాలుగా ఎస్సీ, బీసీ కులాలకు చెందిన నిరుపేదలు గత రెండు దశాబ్దాల క్రితం కొండలు, డొంకలతో పెద్ద, పెద్ద చెట్లతో పడావుగా ఉన్న సీలింగ్ భూమిని సుమారు పది లక్షల రూపాయలు ఖర్చు చేసి, సాగులోకి తీసుకొచ్చి, జీవనం సాగిస్తున్నారన్నారు. తక్షణమే హెచ్చరిక బోర్డులు తొలగించి, సాగులో ఉన్న నిరుపేదలకు పట్టాలు మంజూరు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వారు సానుకూలంగా స్పందించి ఈ భూమిపై విచారణ చేపట్టి తగు న్యాయం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు దేసెట్టి సురేష్, గ్రామ నాయకులు చేదులురి లక్ష్మి, కొసన నారాయణమూర్తి, వడ్లమూరి యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

చౌక ధరల దుకాణాల ముందు మోదీ ఫోటోలు ఉంచాలి

విశాలాంధ్ర - కొత్తపేట : ప్రతి చౌక ధరల దుకాణాల ముందు వాహనాల మీద ప్రధానమంత్రి ఉచితబియ్యం బోర్డులు పెట్టాలని కేంద్ర ఆహార ప్రజాపంపిణీ వ్యవహారాల శాఖ ఆదేశం అని రాష్ట్ర స్వచ్ఛభారత్ అభియాన్ కన్వీనర్ పాలూరి సత్యానందం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఉచితంగా తలసరి 5 కిలోల బియ్యం పథకానికి ప్రధానమంత్రి మోదీఫోటో పెట్టాలని ఇది కేంద్ర ప్రభుత్వ పథకమని, కేంద్ర ప్రభుత్వమే అమలు చేస్తుందన్న విషయం ప్రజలకు చాటి చెప్పేందుకు కరోనా నుండి గరీబ్ కల్యాణ్ యోజన ఫథకం ద్వారా బియ్యం, గోధుమలు ఉచితంగా అందిస్తున్న విషయాన్ని స్పష్టంగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటివరకు తెలుగుసహా మొత్తం 12 భాషల్లో బోర్డుల నమూనాను కేంద్ర ప్రభుత్వమే తయారు చేయించి వీటిని ఎఫ్‌సిఐ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జెమ్ ఫోర్టల్ ద్వారా సేకరించి అన్ని రాష్ట్రాలలో అమలయ్యేలా కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొందని తెలిపారు.

విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి విత్తనాల సుబ్బారావు మృతి

విశాలాంధ్ర - అంబాజీపేట : మండలంలోని గంగలకుర్రు అగ్రహారంనకు చెందిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి విత్తనాల వెంకట సుబ్బారావు (68) మృతి చెందారు. రెండు రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో అమలాపురం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఇంద్ర శేఖర్ వైకాపా నాయకులు గాను, ఆయన కోడలు దుర్గా భవాని జి.అగ్రహారం ఎంపిటిసిగా కొనసాగుతున్నారు. సుబ్బారావు మృతి పట్ల ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు మట్టపర్తి చంద్రశేఖర్, నాయకులు ఎంఎం శెట్టి, వాసంశెట్టి చినబాబు, రాయుడు షన్ముఖ్, రాయుడు కృష్ణ మహేష్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

రికార్డింగ్ డాన్స్‌లో సర్పంచ్

విశాలాంధ్ర - ఏలేశ్వరం : యర్రవరం గ్రామంలో వైసీపీ నాయకులు మందేసి చిందేశారు. గ్రామ సర్పంచ్ బీసెట్టి అప్పల రాజు జన్మ దినం సందర్భంగా రికార్డింగ్ డాన్సులు నిర్వహించారు. ఏలేశ్వరం జెడ్పీటీసీ నీరుకొండ రామకుమారి భర్త సత్యనారాయణ, యర్రవరం ఆంజనేయ స్వామి గుడి చైర్మన్ గుల్లంపూడి గంగాధర్ పాల్గొన్నారు. సామాన్యులకు రికార్డింగ్ డాన్స్‌లకు పర్మిషన్ లేదంటున్న పోలీస్ వారు అధికార పార్టీ నేతలే ఇలాంటి డాన్స్ చేస్తుంటే ఏం చేస్తున్నారని పలువురు ఆక్షేపిస్తున్నారు.

రక్తదానం చేయండి-ప్రాణదాతలు కండి

విశాలాంధ్ర - కొత్తపేట : స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ ఎస్.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదానం, దాని ప్రాముఖ్యత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ డాక్టర్ పివిఆర్ శర్మ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమాజానికి ఉపయోగపడే విధంగా తయారు కావాలని, స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని, అన్ని దానాల కన్నా రక్తదానం మిన్నని చెప్పారు. ప్రతి కుటుంబానికి ఏదో ఒక రకంగా రక్తం అవసరం అవుతుందని కనుక ప్రతి కుటుంబం రక్తదానం చేయటం అలవాటు చేసుకోవాలని తద్వారా ఎన్నో కుటుంబాలకు ప్రాణదానం చేసినట్టు అవుతుందన్నారు. తదనంతరం జిల్లాస్థాయి వ్యాచారచన పోటీలులో గెలుపొందిన కళాశాల విద్యార్థులు షేక్ సఫియా బేగం, కె. దుర్గ భవాని, కె. తేజశ్రీలకు మెమొంటోలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పి.కామేశ్వరి దేవి, జిల్లా కన్స్యూమర్ అసోసియేషన్ సెక్రటరీ ప్రెస్ ఆదిత్య కిరణ్, రెడ్ క్రాస్ సొసైటీ నెంబర్లు యు నాగేశ్వరరావు, పెదపూడి బాపిరాజు, కే మహేష్, జి. శ్రీనివాస్, ఎస్ భీమేశ్వరరావు, కే సత్యనారాయణ, అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

స్నేహితుడి పిల్లల భవిష్యత్తుకు 'సానా' భరోసా

విశాలాంధ్ర - కాకినాడ : ప్రముఖ వ్యాపార వేత్త సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ మేనేజింగ్ ట్రస్ట్ తరపున తన చిన్ననాటి స్నేహితుడు కొటారి సోమేశ్వరరావు, మరణించడంతో విషయం తెలుసుకున్న సతీష్ వెంటనే స్నేహితుడి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం వారి కుటుంబం గురించి ఆరా తీసి పిల్లలు కె. లేఖనా (9 సంవత్సరాలు), కెవిఆర్ ప్రసాద్ (14 సంవత్సరాలు) వారి భవిష్యత్తు విద్యా ఖర్చులకు తన ట్రస్ట్ తరపున చదివిస్తానని హామీ ఇచ్చారు. పిల్లల తల్లిదండ్రులు మరణించడంతో ప్రస్తుతం తాత, మామ్మ పరిరక్షణలో ఉంటున్నారు. వారి భవిష్యత్తుకు తాను భరోసా ఇస్తున్నట్టు సతీష్ తెలిపారు.

నిస్వార్థ సేవలు స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర - అనపర్తి : మూర్తి త్రయం స్ఫూర్తితో అనపర్తి శ్రీ రామకృష్ణ సేవా సమితి గత 21 ఏళ్లుగా నిస్వార్థంగా సమాజానికి అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని రాజమండ్రి రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం రామకృష్ణ మఠంలో సమితి సమకూర్చిన రూ. లక్ష విలువ చేసే స్టీల్ భోజనం ప్లేట్లు 500, స్టీల్ గ్లాసులు 500, హాట్ బాక్స్ లు 2 సమితి కార్యదర్శి తాడి చంద్రశేఖర్ రెడ్డి చేతుల మీదుగా స్వామి పరిజ్ఞేయా మహారాజకు అందజేశారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ రామకృష్ణ మఠంలో విశేష కార్యక్రమాలకు జరిగే భోజన ప్రసాద వితరణకు ప్లేట్లు, గ్లాసులు, హాట్ బాక్సులు వినియోగించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ సభ్యులు ఎం దుర్గాప్రసాద్, సమితి వ్యవస్థాపక కార్యదర్శి మల్లిడి శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

మణికంఠది ఆత్మహత్యే

విశాలాంధ్ర - అమలాపురం : మోదేకురు పంచాయతీ మహిళా సర్పంచ్ కుడిపూడి రామలక్ష్మి వెంకటేశ్వరరావురావులను సీపీఐ ప్రతినిధులు కలిశారు. మణి కంఠ మరణం పైన విచారణ చేయగా మణికంఠది ఆత్మహత్యే అని భావిస్తున్నామని సర్పంచి రామలక్ష్మి,(సర్పంచ్ భర్త కుడిపూడి వెంకటేశ్వరరావు సిపిఐ ప్రతినిధులకు చెప్పారు. ఈ పంచాయతీలో గల కడలి వారి పాలెం 11 వార్డులో సదరు వార్డు మెంబర్ (టీడీపీ ఏకగ్రీవం) కడలి యన్ మీరా సాహెబ్ నైబర్ ఇల్లు కట్టా ధన లక్ష్మిభర్త లక్ష్మణరావు, మృతుని పెద్దమ్మ ఇంటిలో ఈనెల 25వ తేదీ రాత్రి మేడిశెట్టి శ్యామ్ మణికంఠ చనిపోయాడు. పోలీస్ విచారణలో చేతి మణికట్టు వద్ద బాగా లోతుగా కోసుకొని తదుపరి మాత్రమే ఫ్యాన్‌కి ఉరి వేసుకుని ఉండడంతో ఆత్మహత్యగానే భావిస్తున్నామన్నారు. చనిపోయిన పరిస్థితులు పరిశీలిస్తే ఇతను తీవ్రమైన డిప్రెషన్‌లో ఉన్నాడని, గంజాయి మహమ్మారికి బలి అయిన అవకాశాలు కనిపిస్తున్నాయని సిపిఐ ప్రతినిధులు అంచనాకు వచ్చారు. సీపీఐ ప్రతినిధి బృందం కాట్రేనుకోన మండలం కొప్పిగుంట మణికంఠ స్వగ్రామం వెళ్లి మృతుడు మణికంఠ కుటుంబ సభ్యులను కలిసి విచారించిన తరువాత జిల్లా పోలీసు ఉన్నతాధికారులను కలిసి మాట్లాడి సీపీఐ పరిశీలన అంశాలు వారి ముందు ఉంచటం జరుగు తుందని, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సీపీఐ కార్యదర్శి కె. సత్తిబాబు, కొత్తపేట నియోజకవర్గ సీపీఐ ఇంచార్జ్ కె రామకృష్ణా పేర్కొన్నారు.

విభిన్న ప్రతిభావంతులను ఆదుకోవడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - కాకినాడ : విభిన్న ప్రతిభావంతులను ఆదుకోవడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి, కాకినాడ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. కాకినాడ రూరల్ మండలం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా రూ.10 లక్షల విలువ చేసే 10 త్రీ వీలర్స్ ట్రై స్కూటర్లు పంపిణీని ముంతాజ్బుతాన్ చైర్పర్సన్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో స్కూటర్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులను అన్ని రంగాల్లో ఆదుకోవ డం ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యం అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతున్నట్టే విభిన్న ప్రతిభావంతులకు కూడా సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. నియోజవర్గానికి పది చొప్పున 175 నియోజకవర్గాలకు 1750 త్రీ వీలర్స్ ట్రై స్కూటర్లను పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గేసాల శ్రీను, ఎంపీపీ గోపిశెట్టి పద్మజ బాబ్జి, జెడ్పీటీసీలు యాళ్ల సుబ్బారావు నూరుకుర్తి రామకృష్ణ, మార్కెట్ డైరెక్టర్లు వైయస్సార్ రాజు, రేఖ రెడ్డి, రెడ్డి నాయుడు, వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వి. రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికార, ప్రతిపక్ష నేతల మధ్య రాజకీయ రగడ

విశాలాంధ్ర - అనపర్తి : అసెంబ్లీ ఎన్నికలు కేవలం ఏడాదిలోపే ఉండటంతో రాజకీయ ప్రేరణ కలిగిన అనపర్తిలో వైసిపి,టిడిపి మధ్య రాజకీయ వాతావరణం వేడెక్కుతున్నది. మళ్ళీ అధికార, ప్రతిపక్ష నాయకుల మధ్య విమర్శలు, హేళనలు, అవహేళనలు మొదలయ్యాయి.వ్యక్తిగత విమర్శలు ఊపందు కున్నాయి. వైసిపి, టిడిపి నేతలు ఇద్దరు గట్టివారే కావడంతో నియోజకవర్గంలో రోజురోజుకీ రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. నియోజకవర్గంలో ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అంగ, అర్థ బలంతో పాటు శక్తిమంతుడు కావడం, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ముందుకు దూసుకెళ్తుండగా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి టిడిపి వ్యవస్థాపక సభ్యులు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి వారసుడుగా, పోరాట పటిమగల బలమైన నాయకునిగా గుర్తింపు పొందాడు. గత ఎమ్మెల్యేగా అనుభవం ఉండడంతో నియోజకవర్గంలో సత్తి, నల్లమిల్లి మధ్య నువ్వా నేనా అనే విధంగా రోజుకో రాజకీయ పరిణామం చోటు చేసుకుంటున్నది. ఇప్పటికే కొంతమంది టిడిపి నాయకులు వైసీపీలోకి జంప్ చేయడం ఆ పార్టీకి తీరని నష్టమే. ఎన్నికలు సమీపించే కొద్దీ టిడిపిలోకి దూకే వైసిపి నాయకులు కొంతమంది ఉన్నారనే వార్త షికారు చేయడంతో ఇంకా మునుముందు పలు రాజకీయ పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని నియోజకవర్గంలో తీవ్ర చర్చ జరుగుతోంది.

కృత్రిమ అవయవాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - శంఖవరం : కృత్రిమ అవయవాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సీతంపేట ఆర్ఆర్ ఆసుపత్రి చైర్మన్ ఎన్. స్లెస్సర్ బాబు తెలిపారు. బుధవారం ఆర్ఆర్ ఆసుపత్రి ప్రాంగణంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ జిల్లాలోనే మొట్ట మొదటి తయారీ కేంద్రంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే మొట్ట మొదటి సారిగా రూరల్ ఇండియా సెల్ఫ్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆర్ఆర్ ఆసుపత్రి ఆవరణలో దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేసినట్టు ట్రస్ట్ చైర్మ స్లెస్సర్ బాబు తెలిపారు. అన్నవరం, తుని, కిర్లంపూడి, రాజానగరం, జగ్గంపేట, రాజమండ్రి నుండి వచ్చిన దివ్యాంగులకు చైర్మన్ చేతుల మీదుగా ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం కుష్టు వ్యాధిగ్రస్తులు సేవలకే పరిమితం కాకూడదు అనే ధ్యేయంతో సేవలు మరింత విస్తృత పరచాలనే లక్ష్యంతో కృత్రిమ అవయువాలు తయారీ కేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ ఎస్.రాజీవ్ కుమార్, ప్రవీణ్, ప్రసాద్, రిఫరల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, ఆర్ఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

32 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు

విశాలాంధ్ర - కాకినాడ/రామచంద్రపురం : రామచంద్రపురం పురపాలక సంఘాన్ని అన్ని మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా 32 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖమంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. బుధవారం మంత్రి రామచంద్రపురం పురపాలక సంఘం సాధారణ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం అమృత్ పథకం 2.0 నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం, రామచంద్రపురం పురపాలక సంఘం నిధులతో 12 కోట్ల 50 లక్షల రూపాయలతో పట్టణంలోని పాత మంచినీటి పైపులైన్లను తొలగించి కొత్త లైన్లు మార్చడం జరుగుతుందని, ఇతర ప్రాంతాల్లో పైపులు వేయడంతోపాటు, ఇంటింటికి త్రాగునీరు అందించే విధంగా ఈ నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులతో 16 కోట్ల 50 లక్షల రూపాయలతో అంతర్గత మురికి కాలువలు నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. మూడు కోట్ల రూపాయలతో పట్టణంలోని మురికినీటి శుద్ధి చేసే సేవరేజ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కే శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ డిఈ డి దుర్గాప్రసాద్, సంబంధిత విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో రూ.50 కోట్లతో 80 మంచినీటి ట్యాంకులు

విశాలాంధ్ర - కాట్రేనికోన : ముమ్మిడివరం నియోజకవర్గంలో శివారు గ్రామాలకు రూ.50 కోట్లు ఓఎన్‌జిసి నిధులతో 80 మంచినీటి ట్యాంకులు నిర్మించి మంచినీరు అందిస్తున్నామని, రాష్ట్రంలో 175 మంది ఎమ్మెల్యేలలో ఎవరికి సాధ్యం కానిది తనకే దక్కిందని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. బుధవారం పల్లంకురు పంచాయతీ పరిధిలోని పెద్ద పేట, సాపేవారిపేట, కొత్తఆది ఆంధ్రపేట, మొక్కల తిప్పజై భీమ్ నగర్, మచ్చవారి పేటలలో జలజీవన్ పథకం, సిఎస్ఆర్ (ఓఎన్జిసి) నిధులతో నిర్మించిన మంచినీటి ఓవర్ హెడ్ స్టోరేజ్ ట్యాంకులును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయాచోట్ల స్థానిక సర్పంచ్ నాతి అలివేణి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సతీష్ మాట్లాడుతూ ఎవరు మంచి పనులు చేస్తున్నారో ప్రజలు గుర్తించి రానున్న రోజుల్లో జగన్ ప్రభుత్వానికి మద్దతు పలకాలని కోరారు. మంచినీటి సమస్య లేని గ్రామాలుగా తీర్చి దిద్దటమే తన కర్తవ్యం అని ఈ నెలలోనే 40 వాటర్ ట్యాంకులు ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్బీకే అధ్యక్షులు నాతి సత్యనారాయణ, ఎంపిపి పాలేపు లక్ష్మీ ధర్మరావు, జెడ్పిటిసి నేల కిషోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం ఎస్ఐగా కిరణ్ కుమార్ బాధ్యతలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో ఆత్రేయపురం ఎస్ఐగా బివై కిరణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన భీమవరం నుంచి

బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంత వరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన సిహెచ్ సుధాకర్ అమలాపురం విఆర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బివై కిరణ్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

IN THE COURT OF THE 1st ADDL. SENIOR CIVIL JUDGE, KAKINADA

I.P. 15 /2023

Between:

1) **Smt. Pallela Parvathi**, W/o. Venkata Ramana Rao, aged 53 years, Hindu, Housewife, R/o. D.No.2-461, Bapannadora Colony, Road No.1, Balajinagar, Opp. to Mohan Convent, APSP Camp, Kakinada - 533 005.

2) **Smt. Medaparthi Divya**, W/o. Veera Venkata Satyanarayana, aged 30 years, Hindu, Housewife, R/o. D.No.2-461, Bapannadora Colony, Road No.1, Balajinagar, Opp. to Mohan Convent, APSP Camp, Kakinada - 533 005 ... Petitioners

and

Sanka V.V.G.U. Maheswara Rao and 7 others ...Respondents

1) **Sanka V.V.G.U. Maheswara Rao** S/o. Gangadhara Raoaged 46 years, Business, R/o. LIG 25, APIIC Colony, Ramanayyapeta, Kakinada.

2) **Jyothula Srinivas**, S/o. Ramarao, aged 43 years, Business, R/o. EWS 108, APIIC Colony, Ramanayyapeta, Kakinaa.

3) **Jyothula Venkata Mani (Bujji)**, D/o. J. Rama Rao, aged 33 years, Hindu, Business, R/o. EWS 108, APIIC Colony, Ramanayyapeta, Kakinada

4) **Kotha Veera Satya Surya Manga Rao**, S/o. Radha Krishna, aged 50 years, Business, R/o. D.No.2-48-4/4, Balajinagar, Bapannadora Colony, Kakinada.

5) **Sirangu Sridevi**, D/o. Sirangu Chanti (Venu), aged 26 years, Business, R/o. EWS 85, APIIC Colony, Near Ramalayam Temple, Ramanayyapeta, Kakinada.

6) **Dune Bhagyalakshmi**, W/o. Dune Satyanarayana, aged 70 years, Mother of Dune Manikya Venkatarao, R/o. D.No.10-417, Eswar Nagar, Kakinada.

7) **Nagam Nagamani**, Husband name not known, aged 68 years, R/o. LIG32, APIIC Colony, Near Vinayaka Temple, Ramanayyapeta, Kakinada.

8) **Kaluva Jyothi**, D/o. Pandu Ranga Rao, aged 44 years, Business, R/o. EWS-2, Jyothi Tailoring Shop, Near Saibaba Temple APIIC Colony, Ramanayyapeta, Kakinada.

పై నెంబరు పిటిషన్‌లో పిటిషనర్స్ తమను ఇన్‌సాల్వెంట్స్‌గా డిక్లేర్ చేయమని కోరుచూ పై కోర్టువారి ఎదుట పిటిషన్ దాఖలు చేసి యున్నారు. కావున సదరు పిటిషన్‌లో చూపించిన రెస్పాండెంట్స్ మరియు ఇతర బాకీదారులు ఎవరైనా ఉన్నచో పై శ్రీ కోర్టువారి ఎదుట ది.05-07-2023 తేదీన ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలియపరచుకొనవలెను.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

B.రామలింగ శర్మ, V.C.V.S.L.అన్నపూర్ణ
అడ్వకేట్స్, రమణయ్యపేట, కాకినాడ
సెల్: 8008760455

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

ఇళ్ల స్థలాల లేఅవుట్ పరిశీలన

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం దుమంతుని గూడెంలో జగనన్న లేఔట్ ఇండ్ల స్థలమును తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ పరిశీలించారు. లేఅవుట్లో ఇండ్లు నిర్మించుకోవటానికి అనుకూలంగా లేదని స్థానికులు పెద్ద ఎత్తున ఇటీవల ఆందోళన చేశారు. ఈ విషయాన్ని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు నాయకత్వంలో లబ్ధిదారులు గత సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాధవి లత దృష్టికి తెచ్చారు. బుధవారం జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ ఇండ్ల స్థలాలకు ఇచ్చిన భూమిని పరిశీలించడానికి వచ్చారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ విలేకరులతో మాట్లాడుతూ ఈ స్థలానికి ప్రత్యామ్నాయంగా మరో స్థలం చూడటం లేదా ఈ స్థలంలోనే రోడ్డు మార్గం వేసి లేఔట్ ఎత్తు పెంచటం ఈ రెండు మార్గాలలో ఏదో ఒకటి ఎంచుకోవాలని స్థానిక అధికారులకు సూచించారు. ఏమైనా ఒకసారి కొనుగోలు చేసిన భూమిని మార్చటం అంత సులభమైన పద్ధతి కాదని తెలిపారు జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ వెంట కొవ్వూరు ఆర్డీవో మల్లిబాబు, తహసీల్దారు రామకృష, కృష్ణ పాలెం ఎంపీటీసీ సత్తి జగదీశ్వర్ రెడ్డి, వైసీపీ నేత సత్తి సాయి ఈశ్వర్ రెడ్డి స్థానిక రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కత్తిపూడి బస్టాండ్‌లో మరుగుదొడ్లు శుభ్రం చేయరూ..!

విశాలాంధ్ర - శంఖవరం : కత్తిపూడి బస్టాండ్‌లో ఉన్న మరుగుదొడ్లను శుభ్రం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. శంఖవరం మండలంలోని కత్తిపూడి బస్టాండ్ నిత్యం వందలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. బస్సు ఎక్కడానికి అనేక ప్రాంతాల నుండి కత్తిపూడి చేరుకుంటారు. ఈ బస్టాండ్‌లో ఉన్న మలమూత్ర విసర్జనశాలలు గత ఆరు నెలలుగా నిరుపయోగంగా మారా యని ప్రయాణికులు ఎన్నిసార్లు సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి మలమూత్ర విసర్జనశాలలను బాగు చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై తుని ఆర్టీసీ డిపో మేనేజర్ కిరణ్ కుమార్‌ను వివరణ కోరగా నిరుపయోగంగా ఉన్నమాట వాస్తవమేనని, ప్రతిపాదనలు పంపించామని అనుమతులు రాగానే పనులు పూర్తి చేసి వాడుకలోకి తెస్తామని ఆయన తెలిపారు.

నకిలీ పత్రాలతో కోటి విలువైన భూమి కబ్జా

విశాలాంధ్ర - రాజానగరం : ఖాళీగా ఉన్న ఒకరి జాగాల్లో వేరొకరు బోర్డులు పాతి స్థలాలు అమ్మేయడం ఎక్కువగా సినిమాల్లో చూస్తాం. కొంతమంది ప్రబుద్ధులు అమాయకులకు కుచ్చుటోపీ పెట్టేందుకు ఇదే తరహాలో మోసం చేసి పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు. మండల కేంద్రమైన రాజానగరం పోలీస్ స్టేషన్‌లో పి.కాశీ విశ్వనాథం ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించి తూర్పు మండల డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో కొంతమంది ముఠాలుగా ఏర్పడి కేవలం తాళాలు వేసిఉన్న ఇండ్లను దోచుకునేవారని, ఈ నేపథ్యంలో రాజానగరం స్టేషన్ పరిధిలోని కోలమూరు గ్రామంలో 795 గజాల ఖాళీ స్థలాన్ని హైదరాబాదుకు చెందిన పట్నాల జగన్నాథరావు 1986లో కొనుగోలు చేసి తన కుమారుడైన శివప్రసాద్ కు దాఖలు చేశార న్నారు. స్థలంచుట్టూ ఇనుపకంచెలు వేసి జాగ్రత్తలు తీసుకున్నారన్నారు. ఇటువలే తమ స్థలంలో మట్టి వేసి ఉండడం,సరిహద్దు రాళ్ళు వేసి ఉన్నట్లు చూసిన స్థల యజమాని వెంటనే రాజమహేం ద్రవరం సబ్ రిజిస్టార్ నందు చెక్ చేయగా ఆ స్థలం మరొకరి పేరు మీద చూపించడంతో కంగుతిన్నామన్నారు. దీంతో రాజనగరం స్టేషన్‌ను ఆశ్రయించడంతో సమగ్ర దర్యాప్తులో అసలు నిజాలు బయటికి వచ్చాయన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న కొంతమంది వ్యక్తులు, గత కొంత కాలంగా ఖాళీగా ఉన్న శివప్రసాద్ స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి, ఫేక్ ఆధార్ ద్వారా సుమారు కోటిన్నర విలువగల జాగాను అరకోటికే విక్రయించారన్నారు. నకిలీ పత్రాలు సృష్టించి విక్రయానికి పాల్పడ్డ కొత్తల రామ కిషోర్,పడాల శ్రీను,జక్కపు హరీష్,కానూరి శ్రీనివాస కిషోర్, సయ్యద్ రఫీ, కాశి రాజ్ కిషోర్, విప్పర్తి విజయ్ కాంత్, గంట నరసింహమూర్తిలను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు చెప్పారు మరి కొంతమంది బయటకు వచ్చే అవకాశం ఉందని డీఎస్పీ అన్నారు.

రాహుల్ గాంధీని ప్రధానిగా చేసేందుకు కృషి

విశాలాంధ్ర-కొవ్వూరు : త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీనీ ప్రధాన మంత్రిగా చేయడానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సొడదాసి మార్టిన్ లూథర్ అన్నారు. పీ.సి.సి.అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు కొవ్వూరు నియోజక వర్గం పార్టీ ఇన్ ఛార్జ్ అరిగేల అరుణ కుమారి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన నియోజక వర్గ పరిధిలోని పార్టీ కార్యకర్తల సమీక్షా సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు పాల్గొని మాట్లాడుతూ త్వరలో పట్టణ,మండల పరిధిలోని వివిధ కమిటీల నియామకం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు గంధం బాపూజీ, తాళ్లపూడి మండల అధ్యక్షుడు శాయన సుబ్బారావు,బ్లాక్ 1అధ్యక్షుడు కొటీదెల శ్రీనివాస్,జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అందే నాగభూషణం,జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ,అనపర్తి నియోజక వర్గం పార్టీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ వడయార్, సీనియర్ నాయకులు సికిరెడ్డి మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బోసు రాజుని కలిసిన పీసీసీ సభ్యులు గోపాలకృష్ణరాజు

విశాలాంధ్ర - రాజోలు : కర్ణాటక రాష్ట్ర మంత్రిగా సిద్ధరామయ్య క్యాబినెట్‌లో చిన్న తరహా నీటి పారుదల, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భంగా నడింపల్లి బోసు రాజుని బుధవారం బెంగళూరులో వారి స్వగృహంలో మలికిపురం మండలం లక్కవరం గ్రామానికి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణ రాజు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన బోసు రాజుకు శాలువా కప్పి, బొకే ఇచ్చి అభినందనలు తెలియజేసారు. బోసు రాజు గతంలో ఎస్ బంగారప్ప, వీరప్ప మొయిలీ క్యాబినెట్‌లో కూడా మంత్రిగా పనిచేసారు. ఆయన స్వగ్రామం పశ్చిమగోదావరి జిల్లా. ఈయన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహార ఇన్చార్జిగా కూడా వ్యవహరిస్తున్నారు. త్వరలో జరగబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అధిష్టానం కోటా కింద బోసు రాజుకు మంత్రి పదవి ఇచ్చారని గోపాలకృష్ణరాజు అన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, నేరాలు విచ్చలవిడిగా పెరిగిపోయాయని టిడిపి ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఏలూరు పవర్ పేట లోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి నాలుగు సంవత్సరాల రెండు నెలల పాలనలో రాష్ట్రం 46 ఏళ్ళ వెనక్కి వెళ్లిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కూల్చివేతలు, దోపిడీలు, ఆక్రమణలు అఘాయిత్యాలు, మత్తు పదార్థాలు, గంజాయి, మహిళలకు రక్షణ లేకుండా పోవడం తప్ప రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదని మండిపడ్డారు. రాష్ట్రానికి ఎటువంటి పరిశ్రమలు రాకపోవడంతో ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల యువత నిరాశకులోనై గంజాయి వంటి వాటికి బానిసలవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దిబోయిన శివప్రసాద్ ,చోడే వెంకటరత్నం,అర్ ఎస్ అర్ నాగేశ్వరరావు, బౌరతు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు వైసీపీ ప్రభుత్వం అందిస్తున్నట్లు పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని రాచన్నగూడెం గ్రామంలో 159వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసమే ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ నవరత్నాలలో భాగంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. సచివాలయ వ్యవస్థను స్థాపించి ప్రజల వద్దకే పాలన అందిస్తున్నామన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోర్స పోచమ్మ, జడ్పిటిసి మల్లం వసంతరావు, వైస్ ఎంపీపీ సోమ గాని శ్రీనివాసరావు, సచివాలయ మండల కన్వీనర్ వనమా రామకృష్ణ, సర్పంచ్ సున్నం వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు,బోధ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు సంద ప్రసాద్, కేతిరెడ్డి రాఘవరెడ్డి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

అక్కమ్మ కోనేరు రజక చెరువును కాపాడాలి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: స్థానిక రజకుల చెరువు, రజకుల కమ్యూనిటీ భవనాన్ని అభివృద్ధి చేయాలని అక్కమ్మ కోనేరు రజక చెరువును కాపాడాలని రజకుల సమస్యలను పరిష్కరించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షులు చాటపర్తి పోసిబాబు విజ్ఞప్తి చేశారు. స్థానిక అక్కమ్మ కోనేరు రజక చెరువు వద్ద బుధవారం పట్టణ రజక సంఘం అధ్యక్షులు చాటపర్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి,మున్సిపల్ కమిషనర్ బి. భవాని ప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమీషనర్ భవానీ ప్రసాద్ మాట్లాడుతూ తమ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ నాయకులు కోనేటి చంటి, సంపంగి నాని, కసింకోట సతీష్, సూదివరపు నాని, కట్టుంగ సుబ్రహ్మణ్యం, మతం రమణ, గోవాడ పోతురాజు, సంపంగి రమణ, చిలంతరాజుల వెంకటేశ్వర రావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

విశాలాంధ్ర-టి నరసాపురం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ కె. సతీష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఏపిగుంట పంచాయతీ మల్లప్పగూడెం గ్రామానికి చెందిన పొట్ట వెంకన్న బాబు ఎటువంటి అనుమతులు లేకుండా ఎర్రకాలువ లోని ఇసుకను అక్రమంగా తరలివస్తున్నారనే సమాచారంతో తన సిబ్బందితో ఏపిగుంట గ్రామ శివార్లలో బుధ వారం దాడి చేసి ట్రాక్టర్,ట్రాక్టర్ ట్రక్కు,ఒక యూనిట్ ఇసుకను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లుగా ఆయన తెలిపారు.

నాగరాజు దంపతులకు పవన్ కళ్యాణ్ పెళ్లి రోజు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-ఉండి: జనసేన ఉండి నియోజకవర్గ కన్వీనర్ జుత్తిగ నాగరాజు దంపతులకు బుధవారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ నాగరాజు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉండి నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలపై ఆరా తీశారు. జనసేన విజయానికి కృషి చేయాలని ఉండి నియోజకవర్గంలో జనసేన పార్టీ పటిష్ట పరచాలని నాగరాజుకు సూచించినట్లు తెలిపారు. రానున్న ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల పనిచేయాలని వారు సూచించారు. ఏపార్టీకైనా, నాయకుడికైనా గెలుపు ఓటములు సహజమని అన్నింటిని జయించిన వాడే నిజమైన నాయకుడని పవన్ కళ్యాణ్ సూచించినట్లు వారు తెలిపారు.

కులం పేరుతో ధూషించి చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

విశాలాంధ్ర-టి నరసాపురం: కులం పేరుతో ధూషించి చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి నట్లుగా ఎస్ ఐ కె సతీష్ కుమార్ తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొర్రంపాలెం గ్రామం శ్రీనగర్ కాలనీకి చెందిన మహిళ అదే గ్రామానికి చెందిన గొగ్గి పూర్ణచంద్రరావుకు వ్యవసాయ ఖర్చుల నిమిత్తం 2021 సంవత్సరం అక్టోబర్ నెలలో 3 లక్షల రూపాయలు అప్పుగా ఇచ్చింది. ఇటీవల ఆమె కుమార్తెకు అనారోగ్యంగా ఉందని పూర్ణచంద్రరావు దగ్గరకు వెళ్ళి తనకు ఇవ్వవలసిన డబ్బులు అడుగగా తన శారీరక కోరిక తీర్చమని లేదంటే చంపేస్తానని బెదిరించి కులం పేరుతో దూషించినట్లు మహిళ ఫిర్యాదుతో ఎస్ఐ కె.సతీష్ కుమార్ ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసు నమోదు చేయగా పోలవరం డీఎస్పీ ఎ. శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

విశాలాంధ్ర-ఏలూరు: వారాహి యాత్రకు వస్తున్న స్పందనకు ఓర్వలేక పవన్ కళ్యాణ్ ని అళ్ల నాని విమర్శిస్తున్నారని జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జి రెడ్డి అప్పలనాయుడు ఎద్దేవా చేశారు. జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ నరసాపురం సభ కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం అయ్యిందన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీకి చెందిన నాయకులు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఏలూరులో డ్రైనేజీ వ్యవస్థ చాలా తీవ్రంగా ఉందన్నారు. మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా నియంత్రించడంలో పోలీసు వ్యవస్థ విఫలమైందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి ప్రసాద్, జిల్లా కార్యదర్శి కస్తూరి సాయి తేజస్విని,నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, ప్రధాన కార్యదర్శి సరిది రాజేష్, ఫ్యాన్స్ ప్రెసిడెంట్ దోసపర్తి రాజు, తదితరులు పాల్గొన్నారు.

పసువులకు గాలికుంటు వ్యాధి వ్యాక్సినేషన్

విశాలాంధ్ర - కరప : పశువులకు గొంతు వాపు, గాలి కుంటు వ్యాధి, దొమ్మ మొదలగు వ్యాధులకు గురువారం పశువుల ఆరోగ్య కేంద్రం నందు వ్యాక్సినేషన్ వేయడం జరుగుతుందని వెటర్నరీ ఏడి సురేష్ బాబు తెలిపారు. కరప గ్రామంలో పంచాయతీ ద్వారా దండోరా వేయించామని అన్నారు. పశువులు గల పాడి రైతులు తప్పనిసరిగా వ్యాక్సినేషన్ వేయించుకోవాలని సూచించారు .

విద్యా సంప్రదాయంలో నాలుగు నవరాత్రులు

విశాలాంధ్ర - అమలాపురం : శ్రీ విద్యా సంప్రదాయంలో నవరాత్రులు నాలుగు. చైత్రమాసంలో నవరాత్రులను లలితా లేదా శ్రీరామ లేదా వసంత నవరాత్రులుగా, ఆశ్వీయుజమాసంలో నవరాత్రులను దేవీ లేదా దుర్గా లేదా శరన్నవరాత్రులుగా ప్రసిద్ధిగాంచిన వని, ఇవి రెండూ అందరికీ తెలుసని బ్రహ్మశ్రీ వేము శివకుమార్ తెలిపారు. విశ్వశాంతి, లోకకళ్యాణార్థం శ్రీ ఆదిశేష నిలయమునందు నిర్వహిస్తున్న వారాహి షోడశరాత్రి పూజా మహోత్సవాలలో భాగంగా తొమ్మిదోవరోజు నిగ్రహవారాహి పూజలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మాఘమాసంలో నవరాత్రులను శిశిర లేదా శ్యామలా నవరాత్రులు అంటారని, ఇవి మూడోవ నవరాత్రులని, ఆషాడ మాసంలో వచ్చే నవరాత్రులను శాకంబరీ లేదా వారాహి నవరాత్రులు అంటారని, ఇవి నాలుగోవ నవరాత్రులని వివరించారు. హిరణ్యాక్షున్ని సంహరించేందుకు అవతరించిన వరాహస్వామి యొక్క శక్తి స్వరూపమే వారాహి అని, శ్వేతవరాహకల్పే అని మనం ప్రతీ సంకల్పంలో చెప్పుకునే వారాహి అమ్మవారు కోట్ల సంవత్సరాలదేవతన్నారు. శ్వేతవరాహం అత్యంత పురాతనమైన అవతారమని, ఎంతో శక్తివంతమైన వారాహి నవరాత్రులను గుప్త లేదా రహస్య నవరాత్రులుగా తంత్ర శాస్త్రాలు అభివర్ణించాయని ఆయన తెలిపారు. వ్యక్తిగతంగా జరుపుకునే నవరాత్రులను ఇలా సామూహికంగా నిర్వహించటం చాలా అరుదని, అత్యంత విశేషమైన షోడశరాత్రులను భక్తులు వినియోగించుకోవలసినది గా శివకుమార్ విజ్ఞప్తి చేశారు.

గురు పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - అనపర్తి : స్థానిక శేషగిరిరావుపేట,ఐ ఎల్ టి డి, పాత ఊరులోని సాయిబాబా మందిరాల్లో జూలై 3 గురు పౌర్ణమి రోజున ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. దైవజ్ఞ రెడ్డి సురేష్ శర్మ నేతృత్వంలో ఉభయగోదావరి జిల్లాల వేద పండితులతో నవమి వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు పడాల సత్తిరెడ్డి (గురు స్వామి) తెలిపారు.ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆదిలక్ష్మి దంపతులు, పడాల సత్తిరెడ్డి పద్మావతి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. గణపతి పూజ పుణ్యా వచనం, మండపారాధన పూజలు, మహాసంకల్పం, 36 రకాలతో ద్రవ్యాభిషేకం, పుష్కర నది జలాలతో అభిషేకం, లక్ష బిల్వార్చన, విశేష పుష్పార్చన, శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ దత్త సాయి హోమం, నీరాజనం, మంత్రపుష్పములు తదనంతరం తీర్థప్రసాదం జరుగుతుందని రాజు గురు స్వామి తెలిపారు.

అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - గోపాలపురం : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర బాబు డిమాండ్ చేశారు.బుధవారం స్థానిక జె బి స్కూల్ వద్ద గన్వాడీలకు వేతనాలు పెంచాలని,ఐ సి డి ఎస్ బలోపేతానికి బడ్జెట్లో నిధులు పెంపుదల చేయాలని అంగన్వా డీలకు జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని ,అంగన్వాడీల పోరు యాత్రలో సుందరబాబు డిమాండ్ చేశారు. గోపాలపురంలో జరిగిన సభకు ప్రాజెక్టు కార్యదర్శి ఎన్.రామలక్ష్మి అధ్యక్షత వహించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడి వ్యవస్థ నిరివర్యం చేయడానికి కుట్ర పన్నుతున్నాయని, అందులో భాగంగానే నూతన విద్యా విధానం పేరుతో,అంగన్వాడీ కేంద్రాల్లో పాఠశాలల విలీనం చేస్తున్నారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్ కి బడ్జెట్లో నిధులు కేటాయింపు తగ్గించి వర్కర్లకు ఆయాలకు ఇవ్వాల్సిన సౌకర్యాలు పెంచకుండా తగ్గిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.చిరుద్యోగుల ఓట్లతో గద్దెనెక్కిన జగన్ వారి సమస్యల పరిష్కారం చేయలేదని అన్నారు. సమస్యలు పరిష్కరించ మంటే నిర్బంధాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. మాట తప్పను మడమ తిప్పను అన్న ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని అన్నారు. వేతనాలు తక్కువైనా పని ఒత్తిడి మాత్రం తీవ్రంగా ఉందని అన్నారు. ఈ పోరు యాత్ర జాతాకు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.మాణిక్యంబ జిల్లా కార్యదర్శి కే.బేబీ రాణి, బి. మార్తమ్మ అన్నపూర్ణ ఎం. మార్తమ్మ నాయకత్వం వహించారు. ప్రాజెక్ట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

టిడ్కో గృహాలు తక్షణమే అందజేయాలి

విశాలాంధ్ర - పిఠాపురం : టిడిపి హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలు లబ్ధిదారులకు తక్షణమే అప్పజెప్పాలని పిఠాపురం పట్టణ తెలుగుదేశం పార్టీ వారం రోజుల పాటు రిలే నిరాహార దీక్షలకు పిలుపునిచ్చింది. ఈ మేరకు 7వ రోజు బుధవారం మహిళా నాయకులతో కలిసి లబ్దిదారులకు మద్దతుగా లక్ష్మిదేవి వర్మ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ అద్దె ఇళ్ళలో ఉంటూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, లబ్దిదారులకు తక్షణమే గృహాలు అప్పగించాలని, నిత్యవసర ధరలు, విద్యుత్, ఇరత అన్నింటి పై టాక్స్ వేయుట ద్వారా పేదలకు సంక్షేమ పథకాలు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అద్దెలు కట్టలేక టిడ్కో ఇల్లు లబ్దిదారులు, అప్పులు పాలవుతున్నారని అన్నారు. జగన్ ప్రభుత్వం తక్షణమే ఇవ్వాలని అన్నారు. దీక్ష విరమణ అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి వర్మతో పాటుగా నాయకులు, ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు.

వసతుల కల్పనలో రాష్ట్రం వెనుకంజ

విశాలాంధ్ర -ముసునూరు: కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఆంధ్రరాష్ట్రం వెనుకంజులో వుందని నూజివీడు నియోజక వర్గ టిడిపి ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటే శ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని రమణక్కపేటలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్ర మంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో గానీ, ముసునూరు మండలంలోగానీ అన్యాయం జరుగుతున్నా ప్రశ్నించే నాధుడే లేడన్నారు. చంద్రబాబునాయుడు అధికారంలో వుంటే రాజధాని నిర్మాణం,పోలవరం నిర్మాణం, చింతల పూడి ఎత్తిపోతల పథకం పూర్తయ్యేదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, కార్పోరేషన్లు రుణాలు లేవన్నారు. ఫారెస్టు, పోరంబోకు భూముల ఆక్రమణ ఎక్కువైందన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు దేవినేని ధలరామ్, మండల ప్రధాన కార్యదర్శి కందుల పిచ్చియ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు రంగు ఆంజనేయులు, ఉప్పే సత్యనారాయణ, రంగు వాసు, రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు, మెదరమెట్ల సురేంద్ర పాల్గొన్నారు.

ఆలమూరు రైతు బజారు పరిశీలన

విశాలాంధ్ర - ఆలమూరు : ఇటీవల వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా 20 లక్షల నిధులతో మండల కేంద్రమైన ఆలమూరులో ప్రారంభించిన రైతు బజార్‌ను అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ ఐపీ శెట్టి పరిశీలించారు. ముందుగా ఇంచార్జ్ ఎస్టేట్ అధికారి జి సుబ్బారావు రైతు బజార్లో ఏర్పాటు చేసిన కూరగాయల ధరల సూచిక పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో కూరగాయలు విక్రయించే వారు కొనుగోలుదారులకు ఏటువంటి నాణ్యతలోపం లేనటువంటి కూరగాయలతో పాటుగా ప్రభుత్వం నిర్ణయించే ధరలతో కూరగాయలు అందించే విధంగా ఎస్టేట్ అధికారి చర్యలు చేపట్టాలని, పారిశుధ్య విషయంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పంచాయతీ కార్మికులతో ప్రతిరోజు శానిటేషన్ చేయించాలన్నారు.

మోదీ 9 సంవత్సరాల సుపరి పాలనపై ఇంటింటా ప్రచారం

విశాలాంధ్ర - కిర్లంపూడి : భారత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 9 వసం తాల సుపరి పాలనపై బుధవారం కిర్లంపూడి మండలంలో పలు గ్రామాలల్లో ప్రజలకు వివరిస్తూ మండల బీజేపీ శ్రేణులు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.మండల బిజెపి అధ్యక్షుడు యడాలి రాంబాబు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలుకు మోదీ అందిస్తున్న పలు సంక్షేమ పథకాలు, వారి నాయకత్వ పని తీరు ఆమోగం అని రాంబాబు కొనియాడారు. అగ్రగామి దేశం ఐన అమెరికాలో మోదీ ప్రసంగిస్తూ ఎప్పుడూ మీ దేశ "ఆంగ్ల పద్యములను" మా పిల్లలు అనుసరిస్తే నేడు మా "నాటు నాటు" పాటను మీ యువత అనుసరిస్తుందని చెప్పారు. అంటే మా దేశం మీ దేశం కంటే అభివృద్ధి పథంలో నడుస్తుందని చెప్పగలిగే దమ్ము, ధైర్యం, నిజాయితీ కలిగిన ఏకైక నాయకుడు మోదీ కిర్లంపూడ మండల బీజేపీ అధ్యక్షుడు యడాలి రాంబాబు, ఈ గృహ సంపర్క కార్యక్రమం ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ ఉపాధ్యక్షుడు బత్తుల సూరిబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉన్నతికి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర - మండపేట : దివ్యాంగుల ఉన్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవద్దుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 10 మంది దివ్యాంగులకు రూ.9.2 లక్షల విలువైన మూడు చక్రాల మోటారు సైకిళ్లను ఎమ్మెల్సీ తోట పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిపుచ్చుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, మున్సిపల్ కమిషనర్ టి రామ్‌కుమార్, సంస్థ చైర్‌పర్సన్ ముంతాజ్‌పఠాన్, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, కౌన్సిలర్లు పోతంశెట్టి ప్రసాద్, పిల్లి శ్రీనివాస్, మెండు బాపిరాజు, గ్రంథి శ్రీనివాస్, మారిశెట్టి సత్యనారాయణ, శెట్టి కళ్యాణి, మొండి భవాని, మలసాని సీతా మహాలక్ష్మి, వైసీపీ రూరల్ కన్వీనర్ పిల్లా వీరబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు ముక్కా సుబ్రహ్మణ్యం, యారమాటి వెంకన్నబాబు, ముక్కా దాలయ్య, పెంకే గంగాధర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

దళితులను ఆదుకున్నది జగన్ ప్రభుత్వమే

విశాలాంధ్ర-కొవ్వూరు : దళితులకు ఎక్కడ ఏ కష్టం వచ్చినా వెంటనే ఆదుకున్నది వైసీపీ ప్రభుత్వమేనని హోంమంత్రి తానేటి వనిత స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఒక పత్రికలో అవాస్తవాలను ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. బుధవారం కొవ్వూరు క్యాంపు కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రాష్ట్రంలో మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. ఏ సామాజిక వర్గానికి చెందిన మహిళపై దాడి జరిగినా వెంటనే స్పందించిందన్నారు. దాడులు జరిగిన ఘటనలకు సంబంధించి వెను వెంటనే పార్టీలకు అతీతంగా ఎంతటివారైనా చర్యలు తీసుకున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నో దారుణాలు జరిగాయని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయంగా, సామాజికంగా దళితులకు ఎన్నో అవకాశాలు కల్పించారన్నారు. రాష్ట్రంలో ప్రతి వర్గం మహిళ ఆనందంగా, సంతోషంగా ఉన్నామని చెబుతున్నా ఆ పత్రికలకు ఎందుకు కనిపించడలేదన్నారు.

అల్లూరి విగ్రహాన్ని పునఃప్రతిష్టించాలి

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం : నాడు- నేడు అభివృద్ధి పనులలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు చదువుకున్న ఉల్లితోట బంగారయ్య మున్సిపల్ స్కూల్లో తొలగించబడిన అల్లూరి విగ్రహాన్ని జూలై 4వ తేదీ అల్లూరి జయంతిలోగా పునఃప్రతిష్టించాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు స్పందనలో కూడా జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేయడం జరిగిందని, ఇప్పటివరకు ఏ విధమైన చర్యలు తీసుకొనబడలేదని పడాల ఆవేదన చెందారు. ఆ స్కూల్లో ఒకటవ తరగతి నుండి ఆరో తరగతి వరకు చదువుకున్న అల్లూరి పేరును పెట్టాలని, స్కూల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించేందుకు ఒకసారి స్కూలు సందర్శించాలని జిల్లా కలెక్టర్ ను, ఎంపీ మార్గాని భరత్ రామ్‌ను కోరారున గోదావరి గట్టున ఉన్న అల్లూరి నిలువెత్తు కాంస్య విగ్రహానికి రంగులు వేయించి జూలై 4న జరిగే అల్లూరి 125వ జయంతి ముగింపు ఉత్సవం రాష్ట్ర ప్రభుత్వం తరపున ఘనంగా జరపాలని జిల్లా కలెక్టర్ ను కోరడం జరిగిందని, ఇప్పటివరకు ఏ విధమైన కార్యాచరణ జరగలేదని స్వాతంత్ర్య పోరాటంలో దేశం కోసం ప్రాణాలర్పించిన అల్లూరి పట్ల నిర్లక్ష్యం తగదని పడాల హెచ్చరించారు.

కనుల పండుగుగా అమ్మవారి జాతర ముగింపు

విశాలాంధ్ర - సీతానగరం: కనుల పండుగుగా అమ్మవారి జాతర ముగింపు. కూనాలమ్మ తల్లి పుష్కర జాతర బంధు,మిత్రులతో కళకళలాడిన గ్రామం. మండలంలో గల కూనవరం గ్రామ దేవత జాతర ముగింపులో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ హిందూ సంప్రదాయంలో అమ్మవారి జాతర్లకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు.ఈ జాతర సమయంలో ఇతర ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించడం జరుగుతుందని ప్రతి ఇంట ఎంతో సందడి వాతావరణం నెలకుంటుందన్నారు. 12 సవంత్సారాలకు ఒక సారి జరిగే అమ్మవారి చల్లని ఆశీస్సులతో ఈ ప్రాంత ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవనం సాగించాలని,రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా కోరుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఎన్ బి నారాయణ మొదలగు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టీడీపీ తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - నిడదవోలు : ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు రాష్ట్ర ప్రజలకు చాలా అవసరమని నియోజకవర్గ టిడిపి నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ అన్నారు. టీడీపీ గెలుపు కోరుతూ నిడదవోలు టౌన్ లో ఇందిరానగర్ 13 వ వార్డులో ఇంటింటికి టీడీపీ విస్తృత ప్రచారాన్ని కుందుల విస్తృత శ్రేణులతో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మహానాడు సందర్భంగా నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టో కరపత్రాలు పంచారు. టీడీపి గెలుపు ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం మాజీ అధ్యక్షులు గూడపాటి వెంకట్రావు, తెలుగుదేశం నాయకులు వాకలపూడి వెంకటరత్నం, తెలుగు యువతమాజీ అధ్యక్షులు యస్ కే.బాబు, గుడ్ల బుజ్జి,తిరమశెట్టి గణేశ్వరరావు, ముద్దబోయిన గంగారాం, గిద్దా పండు, శ్రీమంతుల వెంకటేశ్వర్లు,సాకు సాయి, పలువురు తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు

జగనన్న సురక్ష విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : వచ్చే నెల నుండి నిర్వహించే జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేయాలని జిల్లా గిరిజన సంక్షేమాధికారి పి. విజయశాంతి ఆదేశించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని వాలు తిమ్మాపురం సచివాలయంలో పర్యటించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులకు సలహాలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా విజయశాంతి మాట్లాడుతూ ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. లబ్ధి పొందని వారిని గుర్తించి ప్రతి ఒక్కరికి సంక్షేమం అందేలా చూడాల్సిన బాధ్యత మనందరి పైనా ఉందన్నారు. నెలరోజుల పాటు నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజయశాంతి సూచించారు. ఆమె వెంట ఎంపిడిఓ అశోక్ కుమార్, పంచాయతీ కార్యదర్శి వరసాల శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

జగనన్న సురక్ష విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - కిర్లంపూడి : వచ్చే నెల నుండి నిర్వహించే జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేయాలని కిర్లంపూడి ఎంపిడిఓ బడే రాజేశ్వరరావు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని గెద్దానాపల్లి 1,2 సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులకు పలు సలహాలు,సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. లబ్ధి పొందని వారిని గుర్తించి ప్రతి ఒక్కరికి సంక్షేమం అందేలా చూడాల్సిన బాధ్యత మనందరి పైనా ఉందన్నారు. నెలరోజుల పాటు నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లను రాజేశ్వరరావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ

విశాలాంధ్ర - కరప : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో కే అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాసరావు పాల్గొని సచివాలయ సిబ్బందికి జగనన్న సురక్ష పథకం పై శిక్షణ ఇవ్వడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. ప్రజలకు కావలసిన సర్టిఫికెట్స్‌ను సత్వరమే అందించేందుకు సచివాలయ సిబ్బంది కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులకు పాల్గొన్నారు.